అంబరాన్నంటిన శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరం

పట్టణ పురవీధుల్లో ముమ్మారు ఊరేగిన పైడిమాంబ

పకడ్బందీ ఏర్పాట్లతో ప్రశాంతంగా ముగిసిన జాతర

భక్తజనంతో పులకరించిపోయిన విజయనగరం

(విశాలాంధ్ర-విజయనగరం బృందం)

విజయనగరం పట్టణం మంగళవారం సిరిమాను జాతర నేపధ్యంలో ఆధ్యాత్మిక శోభతో శోభిల్లింది. జై పైడిమాంబ నినాదం హోరెత్తింది. కదలి తరంగాలలో జనసందోహం తరలివచ్చింది. పాయలుపాయలు గా చేరిన ప్రజాసమూహంతో వీదులన్నీ జనసంద్రం అయ్యాయి. పోటెత్తిన జన కెరటం మధ్యలోంచి సిరిమాను గగనతలాన్ని తాకింది. బంటుపల్లి వెంకటరావు రూపంలో అమ్మ విజయాల నగరానికి దర్శనిమిచ్చింది. ఆకాశ వీధుల్లో ప్రత్యక్షమైన అమ్మకు లక్షలాది చేతులు మొక్కాయి. కదలిఫల నైవేధ్యాన్ని సమర్పించాయి. మదిలోని కోరికలను అమ్మ సన్నిధానానికి చేర్చాయి. మంగళశాసనాలు అర్పించుకున్నాయి. ఆనందపారవశ్యంలో మునిగితేలాయి. దయచూపమని వేడుకున్నాయి. 267 ఏళ్లుగా నిర్విరామంగా, నిరాటంకంగా, నిర్విఘ్నంగా ఈ మహోత్సవం సాగిపోతోంది. సాగుతూనే ఉంది. ఏ యేదికాయేడు దేదీప్యమానంగా వెలుగొందు తోంది. అబ్బురపరిచే ఆ సుందరదృశ్యాన్ని కనులారా వీక్షించేందుకు విజయనగర వాసులే కాదు. ఉత్తరాంధ్రా వాళ్లే కాదు. మూడు రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరావడంతో ప్రతీ కూడలి జన తీర్థాన్ని తలపించింది. అమ్మ ఆశీస్సులకు పాత్రులమయ్యామని సంభ్రమాశ్చర్యాలకి లోనయ్యింది. మనోల్లాసంతో తబ్బిబ్బయ్యింది.

ఎనిమిదోసారి అధిరోహించిన బంటుపల్లి

పైడితల్లి అమ్మవారి జాతరమహోత్సవంలోప్రధాన ఘట్టమైన సిరిమానోత్సవం అంబరాన్ని తాకింది. ఎనిమిదో సారి బంటుపల్లి వెంకటరావు అమ్మవారి ప్రతి రూపంలో సిరిమానుని అధిరోహించారు. వాస్తవానికి అమ్మవారికి అంగరక్షకులైన పతివాడ అప్పలనాయుడు తొలిసారిగా ఈ సిరిమానుని అధిరోహించారు. ఆ పరంపరలో వారి వారసులైన బంటుపల్లి వంశీయులకు ఆ భాగ్యం కలిగింది. మధ్యలో తాళ్లపూడి కుటంబీకులకు అవకాశం వచ్చినా, బంటుపల్లి వెంకటరావు తగిన అర్హత సాధించిన తరువాత వారి కుటుంబానికి ఆ స్థానం తిరిగి వచ్చింది. 2017 నుంచి బంటుపల్లి వెంకట రావు ప్రధాన పూజారిగా వ్యవహరిస్తూవస్తున్నారు. సరిగ్గా... సాయంత్రం నాలుగు గంటలకి సిరిమానోత్సవం ప్రారంభం అయ్యింది. తొలుత పాల ధార, వెల్ల ఏనుగు, అంజలి రథం, జాలారి వల... వాటివెన్నంటే... అమ్మ నడిచింది. కన్నులపండుగ చేసింది. కాలం ఎంత మారిపోయినా ఈ క్రమంలో మాత్రం ఎట్టి మార్పు చోటుచేసుకోలేదు. వివిధ సమూహాలని లీనం చేసుకుంటూ ఈ సంబరం సాగింది. ఆకర్షణీయంగా సాగింది. ఈ అద్భుత ఘట్టానికి జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శ్రీకారం చుట్టారు. అమ్మ అధిరోహించిన సిరిమాను తాడుని లాగి రథాన్ని కదిపారు. అలా మూడు లాంతర్లను దాటుకుని రాజవీధుల్లో నడుచుకుంటూ కోట వరకూ తన ప్రయాణం సాగించింది. తను నిత్యం కొలిచే, అమ్మలగన్న అమ్మ కోటశక్తి అమ్మవారికి ప్రణమిల్లడమే ఈ ఘట్టంలో కీలకం. చూసేందుకు రెండు కళ్లు చాలని ఈ సుందర సుమనోహర ఘట్టం మూడు పర్యాయాలుగా కొనసాగింది, వర్షం కురిసినా.. అమ్మవారి సిరిమాను ప్రారంభ సమయం లో జోరున వర్షం కురిసింది. అయినా భక్తులు చెక్కుచెదరలేదు. వర్షాన్ని లెక్క చేయకుండా అమ్మవారి సిరిమాను సంభరంలో మునిగి తేలారు. కొద్ది సేపటికి వర్షం ఆగడంతో సిరిమాను ప్రారంభం అయింది. మూడు పర్యాయాలు సిరిమాను తిరిగిన అనంతరం తిరిగి వర్షం కొద్దిగా కురిసింది. ఇదంతా అమ్మ మహిమేనఅఇ భక్తులు జైపైడిమాంబ అంటూ నినాదాలు చేసారు.

సిరిమాను జాతరలో అపశృతి...

కూలిన వేదిక

బొత్స కుటుంబానికి తప్పిన ప్రమాదం

ఎస్ఐకు, చిన్నారికి గాయాలు

కూలిన వేదిక

గాయపడ్డ ఎస్ఐ అశోక్‌కుమార్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: శ్రీపైడితల్లి అమ్మవారి సిరిమాను జాతరలో అపశృతి చోటుచేసుకుంది. అమ్మవారి సిరిమాను వీక్షించేందుకు శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ కుటుంబా నికి కేటాయించిన వేదిక ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో వేదిక మధ్యలో నిలబడి ఉన్న ఎస్ఐ అశోక్‌కుమార్‌కాలికి తీవ్ర గాయాలయ్యాయి. అలాగే ఓచిన్నారికి సైతం గాయాలయ్యాయి. వేదికపై కూర్చున్న బొత్స సత్యనారాయణ, ఆయన సతీమణి, మాజీ ఎంపి బొత్స ఝాన్సీ, బొత్స సోదరుడు మాజీ ఎమ్మెల్యే అప్పలనర్సయ్య, బొత్స కుమారుడు సందీప్ దంపతులు తోపాటు పలువురు ముఖ్యనేతలు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. వారికి ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అప్పటికప్పుడు బొత్సకు వేదికను అధికారులు అర్బన్ బ్యాంకు ఖాళీ స్థలంలో ఏర్పాటు చేసారు. అదరాబాదరాగా సిద్దం చేసిన వేదిక వద్ద భారీ వర్షానికి మట్టి కరిగి వేదిక కూలిపోయినట్లుగా తెలుస్తోంది.

సుప్రీం కోర్ట్ చీఫ్ జస్టిస్ గవాయ్ పై దాడి కి ప్రతి భారతీయుడు ఖండించాలి

కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు

విశాలాంధ్ర-బొబ్బిలి : సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ పై జరిగిన దాడి మనన్యాయవ్యవస్థపై,రాజ్యాంగ స్ఫూర్తి పై జరిగిన దాడిగా భావించాలని దాడిని ప్రతి ఒక్కరు ఖండించాలని కారుణ్య ఫౌండేషన్ మరియు రోటరీ జిల్లా చైర్మన్ జె సి రాజు అన్నారు. మంగళవారం కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ రోటరీ క్లబ్ జిల్లా చైర్మన్ మాట్లాడుతూ సి జె ఐ పై జరిగిన దాడి ని ఆయన తీవ్రంగా ఖండించారు. అలాంటి విద్వేష చర్యలకు మనదేశంలో స్థానం లేదని అన్నారు. ప్రతిభారతీయుడు ఈ చర్యను ఖండించాలన్నారు. సుప్రీంకోర్ట్ లో షూ విసిరిన న్యాయవాది చర్యను తేలికగా తీసుకోకూడదని, ఈ సంఘటనను క్షుణ్ణంగా దర్యాప్తు చేయాలని నిందితుడు,తన వెనుక ఉన్న వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఇలాంటి పరిస్థితుల్లో సిజెఐ కక్ష చర్యలకు పోకుండా ఆయన ప్రదర్శించిన మానవత్వం, విలువలు న్యాయవ్యవస్థ పై ఉన్న దృఢత్వం ప్రశంసనీయం అని అన్నారు.

పోలీసులపై దాడిపై దర్యాప్తు వేగవంతం చేశాం : సీఐ

విశాలాంధ్ర-గుర్ల : పోలీసులు పై దాడిని తీర్వంగా తీసుకున్న పోలీసులు ఈ రెండు కేసుల దర్యాప్తు ను వేగవంతం చేస్తున్నాం ఈ కేసుల్లో ముద్దాయులకు శిక్ష పడేందుకు అన్ని రకాల ఆధారాలును సేకరిస్తున్నారు. అందులో భాగంగా ఈ దాడి కేసులలో దర్యాప్తు అధికారి అయిన చీపురుపల్లి సిఐ సాంకేతిక ఆధారాలు ను కూడా సేకరించుటకు గాను విశాఖపట్నం నుండి వచ్చిన సాంకేతిక నిపుణులు (ఫోరెన్సిక్ టీమ్) తో సంఘటన స్థలం అయిన జమ్ము గ్రామంనకు వెళ్ళి అక్కడ కీలకమైన ఆధారాలను సేకరించి, వాటిని విశాఖపట్నం లోని ఫోరెన్సిక్ ల్యాబ్ కు పంపించడమైనది. ఈ రెండు కేసుల్లో ఇప్పటికే 20 మంది ముద్దాయిలు అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం సెంట్రల్ జైలు, విశాఖపట్నంకు పంపించామని, మిగిలిన ముద్దాయిలను కూడా త్వరలోనే అరెస్ట్ చేస్తున్నామన్నరు ఈ రెండు కేసులలో ఇంకా లోతుగా దర్యాప్తు చేయవలసి ఉందని, దర్యాప్తు అధికారి అయిన చీపురుపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ శంకరరావు తెలియజేశారు.

సున్నా నుంచి రెండు సంవత్సరాల పిల్లల అభివృద్ధికై ప్రాధాన్యత ఇవ్వాలి : ఐసిడిఎస్ సిడిపిఓ ఉమాభారతి

విశాలాంధ్ర-గంట్యాడ: గంట్యాడ మండలం బోనంగి గ్రామంలో తల్లితండ్రులను ఉద్దేశించి సున్నా నుంచి రెండు సంవత్సరాలు పిల్లలు ఆరోగ్యంగా ఉండాలని అందుకు అనుగుణంగా సకాలంలో వారి పట్ల శ్రద్ధ వహించాలని సిడిపిఓ ఉమా భారతి తెలిపారు. 8 వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు కార్యక్రమంలో భాగంగా గంట్యాడ సెక్టార్ కో టారి బిల్లీ అంగన్వాడి కేంద్రంలో మంగళవారం నాడు పోషణ మహోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగినది ఈరోజు కార్యక్రమంలో భాగంగా ఐ వై సి ఎఫ్ గూర్చి ఉమా భారతి తల్లిదండ్రులకు అవగాహన కలిగించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు ముర్రుపాలు బిడ్డకు ఇవ్వడం మరియు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలనే ఆహారంగా బిడ్డకు అందించాలని ఆరు నెలల దాటిన తర్వాత తల్లిపాలను కొనసాగిస్తూ అదనపు ఆహారాన్ని పండ్లు, పప్పు అన్నం క్యారెట్ గుజ్జు పదార్థాలుగా తయారుచేసి పిల్లలకు చాలా తక్కువ మోతాదులో మొదలు పెడుతూ నెమ్మదిగా ఆహారాన్ని పెంచాలని అదేవిధంగా అంగన్వాడీ కేంద్రంలో ఇస్తున్న బాలామృతం కూడా జావ, బాలామృతంతో లడ్డు బిస్కెట్లు ఇలా వివిధ రకాల ఆహారాలను పిల్లలకు పెట్టాలని అందువల్ల పిల్లలు ఆరోగ్యవంతంగా ఉంటారని తెలిపారు. పుట్టిన వెంటనే బిడ్డకు టీకాలను సకాలంలో వేయించాలని బరువు ఎత్తు ప్రతినెల గుర్తించాలని తద్వారా పిల్లల యొక్క పెరుగుదలను మెరుగుపరిచేలా అంగన్వాడీ కార్యకర్తలు ఆశా కార్యకర్తలు ఏఎన్ఎం అందరూ శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు.

హోటల్ అసోషియేషన్ ఆద్వర్యంలో మజ్జిగ పంపిణీ

విశాలాంధ్ర-విజయనగరంఫోర్ట్ : పట్టణంలోని కోట జంక్షన్‌లో మారుతి హొటల్ వద్ద మంగళవారం విజయనగరం జిల్లా హొటల్స్ అసోషియేషన్ ఆద్వర్యం లో మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమాన్ని ఎపి హొటల్ అసోషియేషన్ అధ్యక్షుడు (అఫా) జి. శ్రీనివాసరావు ప్రారంభించగా, ముఖ్యఅతిధిలుగా జిల్లా ఫుడ్ ఆఫీసర్ ఈశ్వరి హాజరయ్యారు. వారిచే అమ్మవారి జాతరకు వచ్చిన భక్తులకు మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈసందర్భంగా జిల్లా హొటల్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వాసు, కాళ్ళసునీల్ మాట్లాడుతూ తమ అసోషియేషన్ ఆద్వర్యంలో అన్ని పండగలకు తమవంతు సమాయం చేయాలనే ఆలోచనతో పనిచేస్తున్నామన్నారు. తమ అసోషియేషన్ సభ్యుల సహకారంతో ఈకార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో ఉమామహేశ్వరరావు, బాలు, మహేష్, శ్రీను తోపాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

జానపద నృత్యాలను రాష్ట్ర ప్రభుత్వం ఆదరించాలి : కల్యాణి

ఉత్సవంలో ప్రజలను విపరీతంగా ఆకట్టుకున్న జానపదాలు

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : అంతరించిపోతున్న జానపద నృత్యాలు, సంగీతాన్ని , కళాకారులను ఆదుకోవడానికి విజయనగరం జిల్లాలో డాక్టర్ పీవీజీ రాజు కళావేధిక విశేషమైన కృషి చేస్తుందని ప్రముఖ సినీనటి విజయనగరం వాసి కరాటే కల్యాణి అన్నారు. శ్రీ పైడితల్లమ్మ తోలేళ్ల ఉత్సవంలో భాగంగా సోమవారం స్థానిక అంబెడ్కర్ జంక్షన్ లో డాక్టర్ పీవీజీ రాజు కళావేధిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి ఏర్పాటు చేసిన తెలుగు రాష్ట్రాల జానపదులు కార్యక్రమంలో ఆమె పాల్గొని జానపదాల పాటలు పాడిన అనంతరం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జానపద నృత్యాలను,సాహిత్యాన్ని ఆదరించాలని,సాహిత్యం మరుగున పడిపోకుండా తగిన చర్యలు ప్రభుత్వం తీసుకోవాలని,ప్రజా జీవితంలో ప్రజల అలవాట్లు, ఆనందాన్ని, కలిపి రచయితలు మనకి పాటల రూపంలో అందించారని అన్నారు,సంస్థ అధ్యక్షుడు భీశెట్టి మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో గడచిన తొమ్మిది సంవత్సరాలు గా అమ్మవారి పండుగలో జానపదుల కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నామని ఈ ఏడాది తో పది సంవత్సరాలు పూర్తి చేసుకున్నామని,రేలారే రే రేలా ఫేమ్ జానకిరామ్,దప్పు శ్రీను,దప్పు రాజు, నిరంతర సహకారాన్ని అందిస్తున్నారని, ఈ ఏడాది తెలంగాణ రాష్ట్ర జానపదుల కళాకారులు పాల్గొనడం,మయురి నాట్యాలయ అధినేత శ్రీదేవి కృష్ణ, విద్యార్థులు సాహితీ,యాపిల్,బృందం అద్భుతమైన ప్రదర్శనలు ఇవ్వడం పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యి కార్యక్రమాన్ని విజయవంతం చెయ్యడం తనకు తనతో పాటు పనిచేసిన ప్రతి ఒక్కరికీ ఆనందంగా ఉందని అన్నారు. పోలీసులు ప్రదర్శన చివరివరకు తమకు సహకారం అందించారని భీశెట్టి తెలిపారు,హెల్పింగ్ హాండ్స్ ఇబ్రాస్ అసోసియేషన్ అధ్యక్ష రాలు,దవడ మీనా, స్రవంతి,జ్యోతి ని వెలిగించి కార్యక్రమం ప్రారంభించారు. కళాకారులను కమిటి ప్రతినిధులు ఘనంగా సత్కరించారు.

9న పైడితల్లి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం

విశాలాంధ్ర-విజయనగరం : ఈ నెల 9న శ్రీ పైడితల్లి అమ్మవారి ఆలయ అభివృద్ధి పనులను ప్రారంభిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రకటించారు. గోవా గవర్నర్, మాన్సాస్ చైర్మెన్ పూసపాటి అశోక్ గజపతిరాజు గారి చేతులమీదుగా ఈ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం సందర్భంగా, అమ్మవారికి ప్రభుత్వం తరపున మంత్రి ఆనం పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆయనకు ఆలయ అధికారులు అధికార లాంఛనాలతో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు అనంతరం ఆశీర్వచనాలు పలికి, అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ... విజయనగరంలోని మూడు లాంతర్లు కూడలిలో వెలసిన ఈ అమ్మవారి ఆలయం శతాబ్దాల చరిత్ర కలిగి ఉంది. ఉత్తరాంధ్ర ప్రజల ఇలవేల్పుగా, పూసపాటి రాజవంశీయుల ఇష్టదైవంగా అమ్మవారు ఆరాధింపబడుతున్నారు అంటే అమ్మవారి గొప్పతనం ఏంటో అర్థం అవుతుంది. 1758లో ప్రారంభమైన సిరిమానోత్సవం, నేటికీ అదే ఉత్సాహంతో, అదే విశ్వాసంతో సాగుతోంది. ప్రతి ఏడాది లక్షలాది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, తమ కోరికలు నెరవేరేలా ప్రార్థనలు చేస్తారు. ఈ ఉత్సవం కేవలం భక్తి పండుగ మాత్రమే కాదు, ఉత్తరాంధ్ర ఆత్మను ప్రతిబింబించే సాంస్కృతిక వేడుకగా కూడా నిలిచింది అని చెప్పొచ్చు. ఈ ఏడాది అమ్మవారి జాతర ఉత్సవాలు అంగరంగ వైభవం గా ప్రారంభం అయ్యాయి. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడ అమ్మవారు జాతర ను రాష్ట్ర పండుగ గా గుర్తించి నన్ను నేడు దేవాదాయ శాఖ మంత్రి హోదా లో పట్టు వస్త్రాలు సమర్పించడానికి పంపింది. నాకు అమ్మవారి కి పట్టు వస్త్రాలు సమర్పించే అవకాశం రావడం అనేది పూర్వజన సుకృతంగా భావిస్తున్నను. రాష్ట్ర ప్రభుత్వం భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసింది. పెద్దఎత్తున భద్రతా సిబ్బందిని నియమించడం, అలాగే త్రాగునీటి, వైద్య, రవాణా, పారిశుధ్య సదుపాయాలు కల్పించడం, సుదురా ప్రాంతాల నుండి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ నియంత్రణ కొరకు కూడ ప్రత్యేక చర్యలు తీసుకోవడం, అలాగే మహిళలు, వృద్ధులు, పిల్లల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయడం వంటి అన్ని చర్యలు తీసుకోవడం జరిగింది. అలాగే ప్రస్తుతం ఈ ఆలయం భక్తులకు దర్శనం విచ్చేసిన సందర్భంలో చిన్న ప్రకారం ఉండటం వలన.....మేము భక్తుల భద్రతను గుర్తించి కోటి 80 లక్షల రూపాయలు మంజూరు చేయడమైనది ఇందులో భాగంగా సిజిఎఫ్ గ్రాండ్ రూ.1,44,000/- లు మంజూరు చేయడం జరిగింది. పైడితల్లి అమ్మవారి ఆలయం, విజయనగరం ఆలయ పునర్నిర్మాణం ముఖ్యంగా అంతరాలయం, ప్రాకార మండపం, అనివెట్టి మండపం పునర్నిర్మాణ పనులను 9-10- 2025 వ తేదీ నందు శ్రీ పూసపాటి అశోక్ గజపతి రాజు గారు చైర్మన్ గారి చే శంకుస్థాపన పనులు చేయడానికి నిర్ణయం తీసుకోవడం జరిగింది. అలాగే ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేసే దిశగా మా కూటమి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది. ఆలయ అభివృద్ధి దృష్ట్యా అత్యవసరముగా ఆలయం చుట్టుపక్కల భూముల బదలాయింపులు లేక కొనుగోలుపై స్థలములను తీసుకొనుటకు తగు ప్రపోజల్స్ చేయవలసిందిగా కార్యనిర్వాణాహధికారికి ఇప్పటికే ఆదేశాలు ఇవ్వడం జరిగిందనీ తెలిపారు.

రాజాం మండలం బొద్దాంలో విషాదం

తండ్రి చనిపోయి 24 గంటలు గడవకముందే కుమారుడు మృతి

విశాలాంధ్ర-రాజాం: రాజాం మండలం బొద్దాం గ్రామంలో ఒకే కుటుంబంలో వరుసగా జరిగిన మరణాలతో గ్రామమంతా విషాద ఛాయలు కమ్ముకున్నాయి. రాష్ట్ర, జిల్లా వ్యాప్తంగా డోలక్క వాయించడంలో ప్రసిద్ధి పొందిన కొన్నా బాలకృష్ణ(తండ్రి) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆయన అంత్యక్రియలు సోమవారం మధ్యాహ్నం గ్రామంలో శోకసంద్రంలో ముగిసాయి. అయితే, తండ్రి మరణాన్ని తట్టుకోలేక రెండో కుమారుడు కొన్నా అప్పలరాజు(32) సోమవారం రాత్రి ఆకస్మికంగా మృతి చెందాడు. ఒక్క రోజులోనే తండ్రి, కుమారుడు మృతిచెందడంతో గ్రామమంతా విషాద మయం అయింది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తుండగా, గ్రామ ప్రజలు ఆ కుటుంబానికి ధైర్యం చెప్పేందుకు తరలివచ్చారుస్థానికులు మాట్లాడుతూ, "ఒక కుటుంబం ఇంత పెద్ద విషాదాన్ని తట్టుకోవడం చాలా కష్టమైన విషయం. గ్రామం మొత్తానికి షాక్‌కి గురయ్యాం" అని ఆవేదన వ్యక్తం చేశారు.

బొత్స వేదిక ఘటన ను రాజకీయంగా చూడొద్దు

మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పందన

విశాలాంధ్ర-విజయనగరం: శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం జరుగుతున్న సమయంలో శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆసీనులైన వేదిక కొద్దిగా ఒరిగిందని, సామర్థ్యానికి మించి ఒకే సారి వేదికపైకి బొత్స అనుచరులు ఎక్కడం వలన స్టేజ్ ఒక్కసారిగా ఒరిగిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగలేదని, సామర్థ్యానికి మించి వేదికపైకి ఎక్కొద్దని రెవెన్యూ అధికారులు చెప్తున్నా బొత్స అనుచరులు వినిపించుకోలేదన్నారు. రెండు రోజులుగా వర్షాలు కురవడం, ఈ రోజు కూడా సిరిమాను ప్రారంభం అయ్యే ముందు వర్షం పడటంతో వేదిక ఉండే ప్రాంతం కొంత తడిసిందన్నారు. దీంతో ఒకే సారి వేదిక కొంచెం కూరుకుపోయిందని తెలిపారు. వెంటనే పోలీసులు అప్రమత్తమై బొత్స సత్యనారాయణ కూర్చునే.. కుర్చీని సరి చేశారని, అనుకోకుండా జరిగిన ఘటన కావడంతో రాజకీయ కోణంతో ఎవరూ చూడొద్దని కోరుతున్నామని తెలిపారు.

సంబరాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు

జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయనగరం : ఉత్తరాంధ్ర కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను జాతర మహో త్సవం దిగ్విజయంగా జరిగిందని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి పేర్కొన్నారు. ఉత్సవం ప్రశాంతంగా, విజయవంతంగా జరగడానికి కృషిచేసిన అధికారులకు, పోలీసు యంత్రాంగానికి, ప్రజా ప్రతినిధులకు, నాయకులకు, దేవాదాయ శాఖ, మున్సిపల్ సిబ్బం దికి, ముఖ్యం గా సంపూర్ణంగా సహకరించిన భక్తులందరికీ ఒక ప్రకటన ద్వారా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

అమ్మవారి భక్తులకు సుధారాణి చారిటబుల్ ట్రస్టు వితరణ

విశాలాంధ్ర-విజయనగరం రూరల్ : శ్రీపైడితల్లి అమ్మవారి సిరిమాను జాతర సందర్భంగా వచ్చే భక్తులకు పట్టణంలోని సుధారాణి చారిటబుల్ ట్రస్టు ఆద్వర్యంలో పులిహోర, చక్కెర పొంగలి, వాటర్ ప్యాకెట్లును పంపిణీ చేసారు. ప్రతీ ఏటాడి తమ ట్రస్టు తరుపున భక్తులకు ఉచితంగా పలు రకాల ఆహారాన్ని అందజేయడం జరుగుతోందని, అందులో భాగంగా ఈఏడాది సైతం పంపిణీ చేసామని ట్రస్టు అధ్యక్షుడు ఎంపిజి ఈశ్వరరావు, కార్యదర్శి ఉపేంద్ర, ట్రెజరర్ శిరీషలు తెలిపారు. ఈకార్యక్రమంలో బగ్గాం సాయి, ప్రసాద్, గిరిబాబు, మధుసూధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రూ.1.20 కోట్లతో గ్రామాభివృద్ధి పనులకు అంచనా

సింగరాయి సర్పంచ్ నిరుజోగి వెంకటరావు

విశాలాంధ్ర-వేపాద: మండలంలోని సింగరాయి గ్రామంలో రూ. 1.20 కోట్ల నిధులతో గ్రామాభివృద్ధి పనులకు అంచనా వేయబడినట్లు గ్రామ సర్పంచ్ నిరుజోగి వెంకటరావు తెలిపారు. మంగళవారం గ్రామ సచివాలయ సమావేశ భవనంలో జరిగిన సాధారణ గ్రామసభలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా సర్పంచ్ వెంకటరావు మాట్లాడుతూ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) నిధులతో గ్రామ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.మొత్తం రూ.1కోటి 20 లక్షల అంచనా పనుల్లో రూ.70 లక్షలు ఉపాధి హామీ కూలీల వేతనాల కోసం, మిగిలిన రూ.50 లక్షలు మెటీరియల్ పనుల కోసం కేటాయించారని చెప్పారు.ఈ నిధులను సక్రమంగా వినియోగిస్తే గ్రామం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రతి ఇంటికి ఉపయోగపడే మౌలిక వసతుల సదుపాయాలు కల్పించడమే లక్ష్యం అని సర్పంచ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సత్యవతి, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

జామిలో జోరుగా బెల్ట్ షాపుల దందా

కనీసం పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు

విశాలాంధ్ర-జామి: మండల కేంద్రమైన జామిలో మద్యం గొలుసు దుఖాణాలు విచ్చలవిడిగా పెరిగిపోయాయి. గ్రామం మేజర్ పంచాయతీ కావడంతోపాటు దాదాపు 15వేలకు పైచిలుకు జనాభా నివశిస్తుండడంతో మద్యం అమ్మకాలు జోరందుకుంటున్నాయి. గ్రామంలో రెండు మద్యం దుఖాణాలు నిత్యం పనిచేస్తున్నా బెల్టు దుఖాణాలు మాత్రం ఖాళీ ఉండడంలేదు. మద్యం లైసెన్సు దుఖాణంతో సమానం గా అమ్మకాలు అమ్మే బెల్టు దుఖాణాలు ఉన్నాయంటే ఏస్థాయిలో అమ్మకాలు జరుగుతున్నాయో అర్థం చేసుకోవ చ్చు. జామిలో ఏసమయంలోనైనా చివరకు అర్ధరాత్రి అయినా మద్యం నచ్చిన బ్రాండ్ లభ్యమవుతుందని మందు బాబులు ధర్జాగా చెబుతున్నారు. అయి తే బెల్టు దుఖాణంలో మాత్రం క్వార్టర్‌పై అదనంగా 50రూపాయల వరకు చెల్లిం చాల్సి ఉంటుందని అంటున్నారు. కొన్ని బెల్టు దుఖాణాల వద్ద క్యూ కడుతున్నారంటే ఆశ్చర్యం కలగక మానదు. ఇదిలా వుండగా బెల్టు దుఖాణాలకు మద్యం దుఖాణాల యజమానులు పూర్తిగా అండగా నిలుస్తున్నారు. తక్కువ ధర కలిగిన మద్యంను బెల్టులకు సరఫరా చేస్తూ తమ దుఖాణాల వద్ద అమ్మకాలు నిలిపివేస్తున్నారు. మండలంలోని దుఖాణాలన్నీ సిండికేట్‌గా మారడంతో ఎక్కడనుంచి బెల్టు దుఖాణాలకు సరఫరా అయినా ఎవరూ పట్టించు కోవడం లేదని తెలుస్తోంది.

ఎక్సైజ్ దాడులేవి..!

నిత్యం పట్టపగలు బెల్టు దుఖాణాలు మందుబాబులతో కళకళలాడుతున్నా ఎక్సైజ్ శాఖ అధికారులకు కంటికి కనిపించకపోవడం దారుణం. మద్యం దుఖాణాలలో ఎక్కువ ధరలకు అమ్మకాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తున్నా పరిశీలన చేయడంలేదు. ఇక బెల్టు దుఖాణాలను పట్టించుకోవడం మానేసారు. దీంతో బెల్టు దుఖాణాల నిర్వాహకులు ధర్జాగా అమ్మకాలు చేస్తున్నారు.

ఉపాధి హామీ పనులు గుర్తింపు

విశాలాంధ్ర-బాడంగి: వచ్చే ఆర్థిక సంవత్సరంనకు ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టవలసి ఉన్న పనులను గుర్తిస్తున్నామని ఉపాధి పథకం ఏపీవో సాయిరాం అన్నారు. మండలం ఆకులకట్ట గ్రామంలో మంగళవారం గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో పనులు గుర్తింపు కార్యక్రమం అంచనాల తయారు కోసం గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి కావలసిన పనులను గుర్తించి అంచనా వేస్తున్నామని అన్నారు. ప్రజలకు గ్రామానికి కావలసిన పనులను తెలియజేయ వలసిందిగా గ్రామ ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి టెక్నికల్ అసిస్టెంట్ శ్రీనివాసరావు, సర్పంచ్ సత్యనారాయణ, పలువురు అధికారులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో ప్రశాంతంగా సిరిమానోత్సవం

జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్

విశాలాంధ్ర - విజయనగరం టౌన్: పట్టణంలో శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం కన్నుల పండుగగా ముగిసింది. సిరిమానోత్సవంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ చేపట్టిన పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు, ముందస్తు భద్రత, జాగ్రత్తా చర్యలు సత్ఫలితాలిచ్చాయి. జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ సిరిమాను వెంబడి మూడుసార్లు తిరిగి, శ్రేణులకు తగిన సూచనలు చేస్తూ, బందోబస్తు ఏర్పాట్లును స్వయంగా పర్యవేక్షించారు.సిరిమానోత్సవం ముగిసిన తరువాత భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రధాన కూడళ్ళలో బ్యారికేడ్లును ఒక క్రమ పద్ధతిలో తొలగించి, వారు అన్ని మార్గాలలో వెళ్ళేందుకు అనుమతించారు. పోలీసుశాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీసు సేవాదళ్ దివ్యాంగులు, వృద్ధులు, గర్భిణిలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా విశేషమైన సేవలందించి, ప్రజల మన్ననలు పొందారన్నారు. అదే విధంగా ఆకతాయిల వేధింపులు లేకుండా, వారిపై నిఘా వేసి, అదుపులోకి తీసుకోవడం, మహిళలకు రక్షణ కల్పించడం సత్ఫలితాలిచ్చాయన్నారు. జేబు దొంగతనాలు,చైన్ స్నాచింగ్స్ జరగకుండా ఏర్పాటు చేసిన ప్రత్యేక క్రైం బృందాలు పట్టణంలోని రద్దీ ప్రాంతాల్లో కలియ తిరుగుతూ, అనుమానం ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వేలి ముద్రలను ఎం.ఎస్.సి.డి. డివైజ్లో పరిశీలించి, ఎటువంటి చెడు నడత లేదని నిర్ధారణ చేసుకున్న తరువాతనే వారిని విడిచి పెట్టడం కూడా సత్ఫలితాలిచ్చాయి. సిరిమానోత్సవం అనంతరం సిబ్బంది విధుల నుండి వెళ్ళిపోకుండా పోలీసు అధికారులు చర్యలు చేపట్టి, తమకుకేటాయించిన స్థానం వద్దనే ట్రాఫిక్ రెగ్యులేషన్కు ప్రత్యేక చర్యలను పోలీసుశాఖ చేపట్టడం కూడా సత్ఫలితాలిచ్చింది. సిరిమానోత్సవం సజావుగా, ప్రశాంత వాతావరణంలో ముగియుటకు అన్ని వర్గాల ప్రజల తమ వంతు సహకారాన్ని పోలీసుశాఖకు అందించారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అన్నారు. విద్యుత్, అటవీ, ఆరోగ్య, మున్సిపల్, ఫైర్,రెవెన్యూ, దేవాదాయ మరియు ఇతర శాఖలు సమన్వయంతో పని చేసాయన్నారు. అదే కూడా విధంగా ప్రజలు, పాత్రికేయులు, స్వచ్ఛంద సంస్థలు, ఇతర జిల్లాల నుండి వచ్చిన పోలీసు అధికారులు, సిబ్బంది తమవంతు సహకారాన్ని పోలీసు శాఖకు అందించారని,వారందరికి జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ అభినందించి, ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఎటువంటి దొంగతనాలు జరగకుండా భక్తులను పోలీసు కంట్రోల్ రూం నుండి సిసి కెమెరాలను పరిశీలిస్తూ,ఎప్పటికప్పుడు సంబంధిత పోలీసు అధికారులను, ప్రజలను అప్రమత్తం చేయడం, పోలీసులు మఫ్టీలో పహారా కాయడం, అనుమానితుల వ్రేలి ముద్రలను ఎం.ఎస్.సి.డి. పరికరాలతో చెక్ చేసి, వారు పాత నేరస్థులా? కాదా? అన్న విషయంనిర్ధారణ కావడంతో ఎటువంటి దొంగతనాలు జరగలేదు. అన్ని ముఖ్య కూడళ్ళలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను తాత్కాలిక ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్కు అనుసంధానం చేయడంతో సిసి ఫుటేజులను కమాండ్ కంట్రోల్ నుండే విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి,జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘువులు పర్యవేక్షించారు. సిసి కెమెరాల ఫుటేజులు పరిశీలించి, రద్దీని బట్టి, మార్గాలను మళ్ళించడం జరిగిందన్నారు. విశాఖపట్నం రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి, జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ తోపాటు అదనపు ఎస్పీ పి.సౌమ్యలత,ఎఆర్ అదనపు ఎస్పీ జి.నాగేశ్వరరావు, చింతూరు అదనపు ఎస్పీ పంకజ్ కుమార్ మీనా, డిఎస్పీలు ఆర్.గోవిందరావు,జి.భవ్యరెడ్డి, ఎస్.రాఘువులు, ఎం.వీరకుమార్, ఈ.కోటి రెడ్డి, బి.సీతారాం, షేక్ షాబాజ్ అహ్మద్, పలువురు సీఐలు, ఎస్ఐలు, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది బందోబస్తును పర్యవేక్షించి ఆయా ప్రాంతాలలో విధులు నిర్వహించే పోలీసు అధికారులను, సిబ్బందిని అప్రమత్తం చేయడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడగలిగామన్నారు. పోలీసుశాఖకు సహకరించిన జిల్లా ప్రజానీకానికి జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్ కృతజ్ఞతలు తెలిపారు.

ఉన్మాదిని దేశ బహిష్కరణ చేయాలి

జిల్లా న్యాయ ఉద్యమ వేదిక కన్వీనర్ గంటాన

విశాలాంధ్ర - చీపురుపల్లి: ధర్మాశనంపై బూటు విసిరి సిఐజె బిఆర్ గవాయ్ని అవమానించిన వ్యక్తిని దేశబహిష్కరణ చేయాలని విజయనగరం జిల్లా న్యాయ ఉద్యమ వేదిక కన్వీనర్ గంటానా అప్పారావు డిమాండ్ చేశారు. మంగళవారం చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ధర్మాసనంలో బూటు విసిరి అవమానించడం దేశ ధర్మశాస్త్రాన్ని యావత్తు అవమానించడమేనని ఆయన అన్నారు. ఇటువంటి మనువాది, కులవాది, ఉన్మాదిని దేశ ద్రోహిగా పరిగణించి దేశ బహిష్కరణ చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.

కాసిందొరవలసలో పొలం పిలుస్తోంది

విశాలాంధ్ర - బొబ్బిలి: మండలం కాసిందొర వలస గ్రామంలో వ్యవసాయ అధికారి మజ్జ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. భారీ వర్షాలకు పొలాలలో నిలబడిన నీరును చిన్న చిన్న కాలువ ద్వారా బయటికి పంపిస్తూ మొక్క నిలబడడానికి అవసరమైన పొటాష్ని ఎకరానికి 50 కేజీలు యూరియా కలిపి వేసుకున్నచో వర్షాలు వలన దెబ్బతిన్న పంటలను రికవరీ చేసుకోవచ్చని అన్నారు. అదేవిధంగా మెగ్నీషియం, బోరాన్ లోపం వలన ఆకులు ఎర్రబడుట, కాయ పూర్తిగా పగలకపోవడం లేదా మునిగిపోవడం అంటివి కనిపిస్తాయన్నారు. వీటి నివారణకు మెగ్నీషియం సల్ఫేట్, బోరాన్ కలిసి ఉన్న ఫార్ములా ఫోర్ అనే సూక్ష్మ పోషక పదార్థాలను లీటర్ నీటికి ఐదు గ్రాములు చొప్పున కలిపి పిచికారి చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాశిందరవలస ఉద్యాన సహాయకులు చొక్కాకు అప్పలనాయుడు, రైతులు పాల్గొన్నారు.

స్కౌట్స్, గైడ్స్ విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర - బాడంగి: బాడంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్కౌట్స్, గైడ్స్ యూనిట్ కోసం విద్యార్థుల ఎంపిక కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్ఎం దత్తి సత్యన్నారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో 6వ నుండి 9వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 320 మంది విద్యార్థులు పాల్గొనగా, శారీరక సామర్థ్యం, క్రమశిక్షణ, నాయకత్వం, సహకార భావం వంటి అంశాల ఆధారంగా 64 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపిక ప్రక్రియను స్కౌట్ మాస్టర్ కొల్లి ఈశ్వరరావు గైడ్ కెప్టెన్ ఉమామహేశ్వరి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా హెచ్ఎంఇ మాట్లాడుతూ స్కౌట్స్ గైడ్స్ యూనిట్ బాడంగి పాఠశాలకు మంజూరవటం ఈ ప్రాంతానికే గర్వకారణం అని తెలియజేశారు. ఎంపికైన విద్యార్థులకు ప్రత్యేక శిక్షణా శిబిరం త్వరలో నిర్వహించనున్నారని స్కౌట్ మాస్టర్ కొల్లి ఈశ్వరరావు తెలిపారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధి పనులపై గ్రామసభ

విశాలాంధ్ర - వేపాడ: మండల కేంద్రం వేపాడ గ్రామంలో మంగళవారం సాధారణ గ్రామసభ నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మెలిపాక అర్జునమ్మ అధ్యక్షతన నిర్వహించిన గ్రామసభలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి సిహెచ్ సూర్యనారాయణ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అలాగే గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, పరిష్కారం కోరుతున్న సమస్యలు, ప్రజల అవసరాలపై గ్రామస్థులతో అధికారులు చర్చించారు. అలాగే అత్యవసర పనులను త్రాగునీటి సరఫరా శానిటేషన్, డ్రైనేజీ వ్యవస్థ క్లియరెన్స్ పనులు వెంటనే చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ ప్రజల నుండి వివిధ అంశాలపై సూచనలు అభ్యర్థనలను స్వీకరించి అధికారులు వాటి పరిష్కారానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏఓ ఎం.స్వాతి, ఉపాధి హామీ సిబ్బంది, ఎంపీటీసీ సభ్యులు, గాడి గంగ తల్లి, పంచాయతీ కార్యదర్శి ఎం శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి జయంతి

విశాలాంధ్ర - రాజాం: ఆశ్వీజ శుద్ధ పౌర్ణమి సందర్భంగా శ్రీ కోదండరామాలయంలో మంగళవారం శ్రీ వాల్మీకి జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి, వేదమంత్రాల నాదంతో, నాదస్వర ధ్వనులతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మహిళా భక్తులు, స్థానిక ఆరాధకులు కలిసి లలిత సహస్రనామ పారాయణం చేసి, భక్తి భావంతో కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి మహా నైవేద్యం సమర్పించారు. ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వాల్మీకి జయంతిని ఇదే విధంగా ఘనంగా నిర్వహిస్తామని, భక్తుల సహకారంతో కార్యక్రమాలు విజయవంతం అవుతున్నాయని తెలిపారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించి ఆనందంతో తిరిగి వెళ్లారు.



పని గంటల మార్పు అన్యాయం

కార్మిక హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వం
సిఐటియు జిల్లా ఉపాధక్షుడు తమ్మినేని

విశాలాంధ్ర - వేపాడ: కార్మికుల శ్రమను దోపిడీ చేసేందుకు ప్రభుత్వాలు కార్పొరేట్లకు బోర్లా పడుతున్నాయంటూ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం బొద్దాంలో జరిగిన ఆశా వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహిళలను ఉద్ధరించడానికి ఉన్నామని చెబుతున్న ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు వాస్తవానికి కార్పొరేట్ యజమానుల కాళ్ల వద్ద తలవంచి చట్టాలు మార్చుతున్నాయని విమర్శించారు. ప్రపంచవ్యాప్తంగా కార్మికులు పోరాడి సాధించిన 8 గంటల పని హక్కును చిదిమేయడం దారుణమని ఆయన అన్నారు. లేబర్ కోడ్ పేరుతో కొత్త చట్టాలు తెచ్చి, పని గంటలను పెంచడం అనేది కార్మికుల శ్రమను కార్పొరేట్లకు అప్పగించడమేనని విమర్శించారు. రాత్రి వేళల్లో కూడా మహిళలను పనిచేయించేందుకు చట్టాలు మార్చడం ద్వారా, ఈ ప్రభుత్వాలకు మహిళల పట్ల ఉన్న ప్రేమ ఏ స్థాయిలో ఉందో స్పష్టమవుతోందన్నారు. ఆంధ్రప్రదేశ్లోని ప్రధాన రాజకీయ నాయకులు జనసేన అధినేత పవన్ కళ్యాణ్, టిడిపి అధినేత చంద్రబాబు, వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి మూడూ మోడీ భజనలో మునిగిపోయారని ఆయన విమర్శించారు. ఆశా వర్కర్లను యాప్ పేరుతో వేధించడం ఆపాలని, వారికి కనీస వేతనం ఇచ్చి ఉద్యోగులుగా గుర్తించాలని ఆయన డిమాండ్ చేశారు. రాబోయే వైజాగ్లో నిర్వహించబోయే సిఐటియు జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని తమ్మినేని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సిఐటియు పూర్వ జిల్లా కార్యదర్శి చల్లా జగన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి గాడి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై వ్యాసరచన పోటీలు

విశాలాంధ్ర - రాజాం: రాజాం మండలంలోని డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీఎస్టీ 2.0పై విద్యార్థులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో మంగళవారం వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ దుర్గారావు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సవరణల్లో భాగంగా చిన్నచిన్న వ్యాపారులకు, వ్యవసాయ రంగానికి, విద్యా రంగానికి అనేక రకాల మినహాయింపులు కల్పించిందని పేర్కొన్నారు. ముఖ్యంగా వ్యవసాయ యంత్రాలపై జీఎస్టీని 5 శాతానికి తగ్గించడం వల్ల రైతులకు గణనీయమైన ఉపశమనం లభిస్తుందని, ఇది వ్యవసాయాభివృద్ధికి తోడ్పడుతుందని అన్నారు. విద్యా రంగంలోనూ పాఠశాలలకు అవసరమైన పరికరాలపై తగ్గింపులు విద్యార్థుల చదువుకు ఉపకరించేలా ఉన్నాయని వివరించారు. పోటీలలో పాల్గొన్న విద్యార్థులు జీఎస్టీపై తమ ఆలోచనలను వ్యక్తపరిచి, పన్ను విధానం ద్వారా దేశ ఆర్థిక స్థితిగతులపై కలిగే ప్రభావాలను వివరించారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఆర్థిక అవగాహన పెంపొందించుకోవాలని, ఇలాంటి పోటీలు భవిష్యత్తులో వారికి దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

గుడివాడ అమర్నాథ్ మతిభ్రమించి మాట్లాడుతున్నారు

యువనేత కిమిడి రామ మల్లిక్ నాయుడు

విశాలాంధ్ర - చీపురుపల్లి: మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ మతి భ్రమించి మాట్లాడుతున్నారని యువనేత, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్ మల్లిక్ నాయుడు అన్నారు. చీపురుపల్లి టీడీపీ కార్యాలయంలో ఆయన మంగళవారం మాట్లాడుతూ గుడివాడ అమర్నాథ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుపై చేసిన ఆరోపణలు అవాస్తవాలన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై, యువనేత రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్పై అవాకులు చెవాకులు మాట్లాడితే ఉరికోనేది లేదన్నారు. ఈ రాష్ట్రంలో ఛీటర్ ఉన్నా, లూటర్ ఉన్నా అది మీ జగన్మోహన్ రెడ్డే అని ఎద్దేవా చేశారు. మూడు వేల రూపాయల పెన్షన్ పేదవాడికి ఇస్తానని చెప్పి ఇవ్వలేక గద్దె దిగిపోయిన చేతకాని దద్దమ్మ మీ జగన్మోహన్ రెడ్డి అని కిమిడి అన్నారు. చంద్రబాబు నాయుడు వల్లే ఈ ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని, భోగాపురం ఎయిర్పోర్ట్ పూర్తి కాబోతుందని, అలాగే ఐటి కంపెనీలు రాబోతున్నాయని అన్నారు.

అట్టహాసంగా శ్రీ పైడితల్లెమ్మ సిరిమానోత్సవ సంబరం

(విశాలాంధ్ర-విజయనగరం)

ఉత్తరాంధ్రలో కోరిక కోర్కెలు తీర్చే తల్లి, సిరుల కల్పవల్లి, విజయనగరం ఇలవేల్పు అయిన శ్రీ శ్రీ శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరం మంగళవారం మధ్యాహ్నం సుమారు 4.15 గంటలకు సిరిమానోత్సవం ప్రారంభమయ్యింది. తెలంగాణా, ఒడిశాలలో నుండే కాకుండా అనేక ప్రాంతాల నుండి భక్తులు ఈ సంబరాన్ని చూసేందుకు తండోపతండాలుగా విచ్చేశారు. అంగరంగ వైభవంగా జరిగిన ఈ సంబరానికి లక్షలాది జనం జేజేలు పలుకుతుండగా, బెస్తవారి వల, అంజలి రథం, పాలధార, తెల్ల ఏనుగు ముందు నడవగా అమ్మవారు సిరిమాను రూపంలో మూడుసార్లు కోట వద్దకు వెళ్లి రాజ కుటుంబాన్ని, ఆశేష భక్త జనావళిని ఆశీర్వదించారు. ఈ వేడుకను భక్తజనం కనులారా తిలకించి పులకించారు. సంప్రదాయబద్ధంగా సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానును అధిరోహించి భక్త జనాన్ని ఆశీర్వదించారు. అధికార యంత్రాంగం తీసుకున్న పటిష్ట చర్యల కారణంగా సిరిమానోత్సవం ప్రశాంతంగా పూర్తయింది.